క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చాగల్లు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌ల(ఎన్‌ఎంఎంఎస్)కు ఎనిమిదో తరగతి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బుధవారం ఎంఈఓ వి.ఖాదర్‌బాబు తెలిపారు. డిసెంబర్ 3న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అర్హులన్నారు. పరీక్ష రాసేందుకు విద్యార్థి ఏడో తరగతి పరీక్షా ఫలితాలు ప్రామాణికంగా తీసుకుంటారని తెలిపారు. పరీక్ష రుసుం జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

25న మండల సమావేశం

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ బుధవారం తెలిపారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాగల్లు: మండలంలో గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బి.రాంప్రసాద్ తెలిపారు. మార్కొండపాడులో ఒకటి, చిక్కాల-1లో ఒకటి, ఊనగట్లలో ఒకటి, కలవలపల్లి-2లో రెండు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు శుక్రవారంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయతీలో పరిధిలో ఉండి 10వతరగతి పాసై 18 నుంచి 35ఏళ్ల లోపు వయసు ఉండాలని చెప్పారు. ఈ నెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన అనసూయ దంపతులు



టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న అనసూయ దంపతులు

దేవరపల్లి: టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన భూమన కరుణాకర్‌రెడ్డిని ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఆచంట అనసూయ, సురేష్ దంపతులు తిరుమలలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. చినవెంకన్న స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

పేద వర్గాలకు న్యాయ సహాయం అందిస్తా

నల్లజర్ల: పేదలకు న్యాయ సహాయం అందిస్తానని నల్లజర్ల వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కన్వీనర్ గోగుల మండ బాబ్జి వెల్లడించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తాను అందించిన సేవలకు గుర్తింపు లభించిందన్నారు. తనకు ఈ పదవి ఇచ్చిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్ఐకు సత్కారం



ఆర్ఐ సత్యేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

నిడదవోలు: స్థానిక మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీరా సత్యేంద్ర కుమార్ ఉత్తమ సేవా అవార్డు అందుకున్న నేపథ్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం వచ్చే పేద విద్యార్థులకు తక్షణమే అందించి అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి రాజన్‌బాబు, రాజేష్, గారపాటి ప్రసన్నకృష్ణ, యూసఫ్ షాహి, ప్రసాద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

స్నానఘట్టంలో ఇసుక మేటలు

- పిండ ప్రదానాలకు అవరోధం
- ప్రమాదపు అంచున నిర్వహణ
- మెట్లపై మట్టి, కొట్టుకొచ్చిన చెట్లు



గోష్పాదక్షేత్రం పిండ ప్రదానాల రేవులో మెట్లపై పేరుకుపోయిన ఇసుక



రేవులోకి కొట్టుకొట్టిన భారీ వృక్షం

కొవ్వూరు: ఇటీవల గోదావరి నది వరద ఉధృతికి గోష్పాద క్షేత్రం స్నాన ఘట్టంలో భారీగా ఇసుక మేటలు వేశాయి. పిండ ప్రదానాల రేవులోని స్నానఘట్టంపై పలుచోట్ల మూడడుగుల ఎత్తున ఇసుక పేరుకుపోయింది. వరద ఉధృతికి నదిలో కొట్టుకువచ్చిన తుమ్మ చెట్టు ఈ స్నానఘట్టం రెయిలింగ్‌లకు తగిలి ఇక్కడే ఉండిపోయింది. స్నానఘట్టానికి దిగువన రెండు మూడు చోట్ల ఇసుక, ఒండ్రు మట్టితో మేటలు వేశాయి. ఈ క్షేత్రం పవిత్రతను దృష్టిలో ఉంచుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి భక్తులు ఇక్కడకు వస్తుంటారు. ఈ క్షేత్రంలో అపరకర్మలు నిర్వహించి, గోదావరి నదిలో తర్పణాలు విడిచి పెడుతుంటారు. మెట్లపై ఇసుక మేటలు వేసి ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పిండ ప్రదానం పూజా క్రతవు అనంతరంలో నదిలో తర్పణం విడిచి పెట్టాలి. ఒడ్డునే భారీగా ఇసుక మేటలు వేయడంతో భయపడతూ నదిలోకి దిగుతున్నారు. కొందరైతే గోష్పాద క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలోనే నిమజ్జనం చేస్తున్నారు. ఈ క్షేత్రంలోని ఉప ఆలయాలతో కలిపి ఇరవైకి పైగా ఆలయాలు ఉన్నాయి. నిత్యం ఈ క్షేత్రంలో స్నానాలు ఆచరించే రేవులో అపరకర్మలు తర్పణాల నిమజ్జనం చేస్తున్నారు. దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. పిండ ప్రదానాల రేవులో ఇసుక మేటలను తొలగిస్తే ఈ క్రతువులను ఆ రేవులో నిర్వహించుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

జగనన్న కాలనీ పరిశీలన

కొవ్వూరు: రాష్ట్ర స్థాయిలో జగనన్న కాలనీల్లో సాముహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో కాపవరం జగనన్న కాలనీలో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నోడల్ అధికారి, గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ జీవీ ప్రసాద్ ప్రకటించారు. బుధవారం ఆయన గృహనిర్మాణ శాఖాధికారులతో కలిసి కాపవరంలో కాలనీ ఇళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాపవరం కాలనీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. ఇళ్ల నిర్మాణ చేపట్టిన లబ్ధిదారులందరికీ సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేసి చెల్లింపులు చేయాలని సూచించారు. కాలనీలో నిర్మిస్తున్న ఆర్చ్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్, డీఈ టి.శేఖర్‌బాబు, ఏఈ కేఎస్ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి బాల సుబ్బలక్ష్మి, కాపవరం సొసైటీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఎంపీడీఓ కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు



మంత్రి వేణు చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు



కలవలపల్లిలో మునేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు



సీఎం జగన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాగ శ్రీనివాస్

కొవ్వూరు: పట్టణ పోలీసు స్టేషన్ ఏఎస్సై సంకురాత్రి నాగ శ్రీనివాస్ పోలీసు మెరిటోరియల్ సర్వీస్ అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రపతి రామనాథ్ కోవిద్ అందించిన ఈ అవార్డుని స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీనివాస్ మెడల్ అందుకున్నారు. 34 ఏళ్ల పోలీసు సర్వీస్‌లో ఏవిధమైన రిమార్కుల్లేకుండా పనిచేసినందుకు, విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు గాను ఈ అవార్డు లభించినట్టు శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం శ్రీనివాస్ డిప్యూటేషన్‌పై డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్నారు.

నిడదవోలు: విపత్తుల సమయంలో తన విధులను అంకితభావంతో చేసిన నిడదవోలు అగ్నిమాపక కేంద్రంలో పని చేస్తున్న జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి ఓ శ్రీనివాసరావు ఉత్తమ సేవా పురష్కారం లభించింది. బీసీ సంక్షేమ శాఖ, సినిమాటోగ్రఫీ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రం అందుకున్నారు. ఫైర్‌మన్లు శ్రీనివాసరావుని అభినందించారు.

మునేశ్వరరావుకు సత్కారం

చాగల్లు: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ గ్రేహౌండ్స్ పోలీస్‌గా సేవలందించిన మానుకొండ మునేశ్వరరావు రాష్ట్రపతి పురస్కారాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడంతో స్వగ్రామైన కలవలపల్లి గ్రామస్తులు బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. మునేశ్వరరావు సేవలను కొనియాడారు. సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ, నాయకులు ప్రత్తిపాటి శశాంక్, కొండేపాటి వెంకటేశ్వరరావు, ఆత్కూరి సత్యనారాయణ, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్వోకు అభినందన

ఉండ్రాజవరం: వేలివెన్ను వీఆర్వో వాడపల్లి మురళికి ఉత్తమ అవార్డు రావడంపై ఉండ్రాజవరం బ్రహ్మణ సేవా సమితి సభ్యులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు చేతులమీదుగా మురళి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. మురళిని సమితి సభ్యులు ఆకెళ్ల శ్రీనివాసు, దోనేపూడి సుధాకర్, నె.సత్యకృష్ణ, సత్యనారాయణ, వెంకట్రామయ్య, గోపాలకృష్ణమూర్తి అభినందించారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



పోతినీడుపాలెంలో పంట వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి కమల్‌రాజ్

గోపాలపురం: రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు అన్నారు. గంగోలు గ్రామంలో బుధవారం ఈ-పంట నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ రాజారావు మాట్లాడుతూ సాగు చేసే ప్రతి రైతు ఏ సర్వే నంబర్‌లో ఎంత విస్తీర్ణం సాగు చేస్తున్నారన్న విషయాన్ని ఈ-పంట నమోదు ద్వారా తెలుస్తుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ఆర్బీకేల్లో రైతులు ఈ-పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఈ–పంట నమోదు చేయించుకోవాలి

నల్లజర్ల: రైతులకు ఈ-పంట నమోదుతో ఎంతో మేలు జరుగుతుందని మండలవ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ అన్నారు. బుధవారం పోతినీడుపాలెంలో ఈ-పంట నమోదు ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందించే ప్రతి పథకం ఈ-పంట నమోదుపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రతి రైతు తమ పంటలను తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వ్యవసాయశాఖ సహాయకులను కలిసి సాగు చేసిన పంటరకం, విస్తీర్ణం, సర్వే నంబరు, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకంతో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలో 10,880 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయన్నారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు పామర్తి సురేష్ ఉన్నారు.

నిడదవోలు రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ జి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పురుషోత్తపల్లి, సమిశ్రగూడెం గ్రామాల్లోని పొలాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ-క్రాప్ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే రాయితీలు, పంటల బీమా, నష్టపరిహారం వరిస్తాయన్నారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్లు కె.శివనాగు, మాధవన్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వార్డు ఎన్నికల ప్రచారం



గోపాలపురం 16వ వార్డులోఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి బాబూరావు

గోపాలపురం: ఈనెల 19వ తేదీ జరిగే పంచాయతీ వార్డు సభ్యుల ఎన్నికలకు అభ్యర్థుల ఎన్నికల ప్రచారం వేగవంతం చేశారు. బుధవారం 12, 16 వార్డుల్లో పోటీలో ఉన్న ఆరుగురు అభ్యర్థులు ప్రచారం చేశారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఇద్దరూ ఎన్నికల ప్రచారంలో ముందున్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులు ప్రచారం కొనసాగిస్తున్నారు. 12వ వార్డులో ముగ్గురు, 16వ వార్డులో ముగ్గురు అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులను చూపుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. 17 సాయంత్రంతో ప్రచారం ముగిస్తుంది. 19న 7 గంటల నుంచి ఎన్నికల పోలింగ్, 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.సోమశేఖర్ తెలిపారు.

దమ్మెన్నులో ఎన్నికల ప్రచారం

ఉండ్రాజవరం: దమ్మెన్ను గ్రామ పంచాయతీలో జరిగే తొమ్మిదో వార్డు ఎన్నికల ప్రచారాన్ని బుధవారం జోరుగా సాగింది. 9వార్డులో అభ్యర్థి కోడవటి సూరిపండు ఇంటింటికి తిరుగుతూ తమ గుర్తు అయిన కుక్కర్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఈయన వెంట ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


రీ సర్వేతో రైతులకు మేలు

చాగల్లు: శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. మల్లవరం రెవెన్యూ గ్రామ పరిధిలో సమగ్ర భూముల రీ సర్వేలో భాగంగా బుధవారం గ్రామసభను నిర్వహించారు. డ్రాఫ్ట్ ఆర్‌వోఆర్ ప్రచురణకు సంబంధించి చంద్రవరం యూపీ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ సభలో తహసీల్దార్ మాట్లాడుతూ సమగ్ర సర్వే ద్వారా భూములను పక్కాగా సర్వే చేసి హద్దులను చూపుతూ హక్కు పత్రాలను అందించడం వల్ల భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తవన్నారు.రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.ఆనంద్, వీఆర్‌వోలు, సర్వే సిబ్బంది, మల్లవరం, చంద్రవరం, గౌరీపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ రాబడి రూ.1.85 కోట్లు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయ హుండీల లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. గడచిన 20 రోజులకు గాను రూ.1,85,91,793 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 155 గ్రాముల బంగారం, 5.025 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.16 వేలు లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

4166 మంది ఓటర్ల సవరణ



సమావేశంలో సర్వే వివరాలను నాయకులకు అందజేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు

గోపాలపురం: ఓటర్ల సర్వేలో గత నెల 21వ తేదీ నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ నియోజకవర్గంలో బూత్ లెవెల్ అధికారులు, యూనిట్ ఇన్‌చార్జిలు సేకరించిన ఓటర్ల సవరణలో 1466 మంది ఓటర్లు సవరించినట్టు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఓఎన్‌జీసీ)టీఈఎం రాజు అన్నారు. గోపాలపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఓటర్ల సవరణపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. గోపాలపురం మండలంలో 698, దేవరపల్లి మండలంలో 1009, నల్లజర్ల మండలంలో 888, ద్వారకాతిరుమల మండలంలో 1571మంది ఓటర్లు సవరణ చేయించుకున్నట్టు తెలిపారు. ఆయా సవరణ క్షేత్రస్థాయి సర్వే వివరాలను ఆయా రాజకీయ పార్టీ నాయకులకు అందజేశారు. తహసీల్దార్‌లు ఎం.రామకృష్ణ, ఎస్.కృష్ణ, బి.దుర్గామహాలక్ష్మి ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఇరవై కిలోల గంజాయి స్వాధీనం

కొవ్వూరు: పట్టణంలోని బైపాస్ రోడ్డు కాటన్ విగ్రహం సమీపంలో గంజాయి మూటలతో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ ఎస్సై డి.భూషణం బుధవారం తెలిపారు. చెడు వ్యాసనాలకు బానిసైన యువకులు అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి రెండు మూటల్లో గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి నుంచి రెండు మూటల్లో ఇరవై కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టణానికి చెందిన ఆర్.గోపిచంద్, జి.సాయితేజ, టి.ఉదయ రత్నకిరణ్, కె.లోవరాజు, వేములూరుకి చెందిన కె.శ్రీతేజ పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు.

కుట్టుమెషీన్ల అందజేత



మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన ఎస్సై తదితరులు

తాళ్లపూడి: పెద్దేవంలో జగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వశక్తి ద్వారా సుమారు 35 మంది మహిళలకు బుధవారం కుట్టుమెషీన్లు అందజేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన టైలరింగ్ ఉచిత శిక్షణ ముగియడంతో ఎస్సై కె.వెంకటరమణ చేతుల మీదుగా కుట్టు మెషీన్లు, సర్టిఫికెట్లను అందజేశారు. సంస్థ ప్రతినిధి గర్రే రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి స్వశక్తి సెంటర్ పేరుతో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల సూర్యనారాయణ, బోడపాటి కాశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న నాయకులు

నిడదవోలు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఎన్టీఆర్ కాలనీలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు జువ్వల రాంబాబు, కౌన్సిలర్ దాకే అనిల్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు చెట్టే రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు కలగ రమణలు, ఎన్టీఆర్ కాలనీ యూత్ సభ్యులు రుత్తల వరప్రసాద్, కుర్రు పద్మసాయి, నాగరాజు, సూర్య, గనిరాజు, పవన్, నాగేంద్రబాబు, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

దేవరపల్లి: గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో దేవరపల్లిలోని ఎస్సీ ఏరియాలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించిరు. రూ.7 లక్షలతో రోడ్లు, రూ.8 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం చేస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కడిమి రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో వెండి వస్తువుల చోరీ

తాళ్లపూడి: ఇంట్లో వెండి వస్తువులను దొంగలు అపహరించుకుపోయారని గజ్జరం గ్రామానికి చెందిన కాకర్ల కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.వెంకట రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కళావతి వైజాగ్‌లో ఉంటున్న తన కుమార్తె వద్దకు గత నెల 23వ తేదీన వెళ్లింది. 15వ తేదీన ఇంటికి వచ్చి చూడగా తలుపు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోని బీరువాలో ఉన్న వెండి పళ్లెం, వెండి గ్లాసు, వెండి పంచపాత్ర, కుంకుమ భరిని సుమారు రూ.20 వేలు వగల వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. కొంత నగదు కూడా ఉందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీలో అక్రమాలు



ఖండవల్లిలో అంగన్‌వాడీ సూపర్ వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలను విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు



అక్రమంగా తరలిస్తున్న రేషన్ సరకులు ఇవే

పెరవలి: కంచె చేను మేస్తుందన్న చందంగా లబ్ధిదారులకు అందాల్సిన ప్రభుత్వ రేషన్‌ను అధికారే స్వయంగా అక్రమాలకు పాల్పడడంతో అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఖండవల్లి గ్రామంలోని 24 నంబర్ గల అంగన్‌వాడీ కేంద్రంలో పెరవలి ఐసీడీఎస్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న వనజాక్షి అక్రమంగా సరుకులు పట్టుకెళుతుండగా ఆ గ్రామ ఎంపీటీసీ, వలంటరీలతో కలసి బుధవారం నేరుగా పట్టుకున్నారు. దీనితో మండల రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విచారణ చేపట్టారు. ఖండవల్లిలో అంగన్‌వాడీ కేంద్ర నుండి 3 ఆయిల్ ప్యాకెట్లు, 3 పాలు ప్యాకెట్లు, 15 కిలోల బియ్యం, రెండు కోడిగుడ్ల అట్టలు మోటారు సైకిల్‌పై తన కుమారుడి సహకారంతో పట్టుకెళుతుండగా వీరు నేరుగా పట్టుకుని నిలదీశారు. ఎస్సీ ఏరియాలోని సెంటర్‌కు పట్టుకెళుతున్నానని చెప్పడంతో ఎంపీటీసీ సభ్యులు పల్లేటి రవి, బొకే వెంకటేశ్వర్లు తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన సివిల్ సప్లయ్ డీడీ కృష్ణారావు దీనిపై విచారణ చేపట్టడంతో అవినీతికి పాల్పడినట్టు రుజువైంది. దీనిపై విచారణ పూర్తి చేసిన తరువాత కేసు నమోదు చేయడానికి పెరవలి స్టేషన్‌కు అధికారులు, ఎంపీటీసీ సభ్యులు వెళ్లారు. ఈ సరుకులు పట్టుకుని వెళుతుండగా పట్టుకున్న వారిలో ముగ్గురు వలంటీర్లు సతీష్, మహేష్, శివనాగరాజు మాట్లాడుతూ తమ పరిధిలో ప్రభుత్వ పథకాలు గురించి వెళుతున్నప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకులు సక్రమంగా ఇవ్వటం లేదని లబ్ధిదారులు చెప్పడంతో తాము ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, ఎంపీటీసీలకు తెలిపామని చెప్పారు. మండల పరిషత్ సూపరిడెంట్ రమేష్, వీఆర్వోలు సుబ్బారావు, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, స్థానికులు ఉన్నారు.